
మన్యంలో ప్రాజెక్టులు, చెరువులకు జలకళ

- సుమారు 30 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు
- ఇప్పటికే ఖరీఫ్‌లో పలు రకాల పంటలు వేసిన రైతులు

బుట్టాయగూడెం: గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై నుంచి నేటివరకూ వర్షాలు దంచి కొడుతున్నాయి. ప్రతి రోజూ ఏదో సమయంలో వానలు కురుస్తూనే ఉండడంతో మన్య ప్రాంతంలోని చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరాయి. దీనితో చెరువులు, ప్రాజెక్టులు నిండు కుండలా కనిపిస్తున్నాయి.

ఆయకట్టు భూములకు పుష్కలంగా సాగునీరు

మన్యంలోని సుమారు 128 మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలోని సుమారు 30 వేలకు పైగా ఆయకట్టు భూములు ఉన్నాయి. ఇప్పటికే ఈ భూముల్లో రైతులు వివిధ రకాల పంటలను ఈ ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్నారు. ప్రధానంగా వరి, ప్రత్తి, మొక్క జొన్న, వేరుశనగ, చెరకు పంటలను రైతులు వేశారు. సుమారుగా 1600 ఎకరాల వరకూ భూముల్లో రైతులు పంటలు వేసినట్లు అధికారులు, రైతులు చెప్తున్నారు. అయితే ఈ భూములన్నీ వర్షాధారం మీదే ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం భారీగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరడంతో తమకు సాగునీరు కొరత తీరినట్లే అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు భారీగా చేరడంతో భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల బోర్లలో నీరు సమృద్ధిగా లభించనున్నాయి.


పోగొండ రిజర్వాయర్ నిండుకుండలా ఉన్న దృశ్యం


కొమ్ముగూడెం చెరువుకు జలకళ

ప్రాజెక్టుల్లో నీరు

మన్యప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంకు జలకళతో కళకళలాడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుత వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో 215.85 మీటర్లు సామర్థ్యంతో నిండి ఉంది. అదేవిధంగా పోగొండ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 157 మీటర్లు కాగా సామర్థ్యాన్ని మించి నీరు బయటకు ప్రవహిస్తుంది. అదేవిధంగా కొవ్వాడ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 90.50 మీటర్లు కాగా ప్రస్తుతం 88.75 మీటర్లుతో ప్రాజెక్టు నీరు నిండి ఉంది.

సాగునీటికి కొరత లేదు



గతంలో ఎన్నడూలేని విధంగా వర్షాలు కురుస్తూ ఉండడంతో చెరువుల పరిస్థితిపై అప్రమత్తంగా ఉన్నాం. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెరువులు, ప్రాజెక్టుల్లో భారీగా నీరు ఉండడంతో ఆయకట్టు రైతులకు పుష్కలంగా నీరు అందించేలా కృషి చేస్తాం. ప్రస్తుతం ఖరీఫ్‌కి నీరు కొరతలేదు. అలాగే రబీలో కూడా సాగునీరు అందించేలా కృషి చేస్తాం.

– టి.సురేష్, మైనర్ ఇరిగేషన్ ఏఈఈ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

మొత్తం చెరువులు	128
100 ఎకరాల పైబడిన చెరువులు	40
చిన్న చెరువులు	81
చెక్‌డ్యామ్‌లు	48
ఆనకట్టలు	300
ప్రాజెక్టులు	3

క్షేత్ర రహదారి.. గోడు వినేవారేరీ?

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి చేరుకునే భీమడోలు–ద్వారకాతిరుమల ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారిపై పలుచోట్ల పడిన గుంతలే అందుకు కారణం. నిత్యం వేలాది మంది భక్తులు చినవెంకన్న దర్శనార్థం వివిధ వాహనాలపై ఈ మార్గం గుండానే క్షేత్రానికి చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే కొందరు భక్తులు ద్వారకాతిరుమలలోని షణ్ముఖ ఫంక్షన్ హాల్, నిమ్మకాయల మార్కెట్ యార్డు, పంగిడిగూడెం తదితర ప్రాంతాల్లో రోడ్డుపై ఉన్న గుంతల్లో పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. తాజాగా శనివారం రాత్రి షణ్ముఖ ఫంక్షన్ హాల్ వద్ద గుంతలో పడి ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురు గాయాలు పాలైన విషయం తెలిసిందే. ఇలా తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని భక్తులు, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.


షణ్ముఖ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డుపై ఉన్న గుంతను తాత్కాలికంగా కంకరతో పూడ్చిన దృశ్యం


పంగిడిగూడెం వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడ్డ గుంతలు


కుంకుళ్లమ్మ ఆలయ మలుపులో రోడ్డుపై ఏర్పడ్డ దిబ్బ.

గెడా జగ్గారావు మాస్టారు సేవలు ఆదర్శం

జంగారెడ్డిగూడెం: ప్రగతిశీల భావజాలాలున్న గెడా జగ్గారావు సేవలు ఆదర్శనీయం అని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పాకలపాటి రాఘవరావు అన్నారు. స్థానిక ఆలపాటి గంగాభవానీ కళ్యాణమండపంలో ఆదివారం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గెడా జగ్గారావుకు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడమే కాకుండా ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా గెడా జగ్గారావు దంపతులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, జనసేన నాయకుడు మేకా ఈశ్వరయ్య, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.నరసింహారెడ్డి, ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సన్మాన సభలో గెడా జగ్గారావును సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థులకు మొమెంటోల అందజేత

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం ఫారూఖీ మసీద్‌లో ఆదివారం ఇస్లాహీ జల్సా ఇస్తెమా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ అఫ్రోజ్ ఖాన్ శిక్షణలో అరబ్బీలో ప్రతిభ కనబర్చిన 35 మంది విద్యార్థినీ విద్యార్థులకు మొమెంటోలు అందజేశారు. మాజీ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ ముస్తఫా చేతుల మీదుగా మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం పెద్దలు ముఫ్తీ రహ్మతుల్లా, సిరాజ్ భాయ్ మాట్లాడుతూ యువకులు ఆధ్యాత్మిక చింతన కలిసిగి సన్మార్గం వైపు నడుచుకోవాలన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, సమాజంలో మంచి పనులు చేయాలన్నారు. నైతిక విలువలు కలిగిన జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు పఠాన్ అన్వర్ బాషా, ఉపాధ్యక్షుడు ఎస్‌కె ఫకీర్‌షా, నాసిర్, ఇమామ్, ఎండీ లాల్‌సా తదితరులు పాల్గొన్నారు.


లక్కవరంలో అరబ్బీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి మొమెంటోలు అందజేస్తున్న దృశ్యం

రోడ్డుపైనే నిరీక్షణ

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

కొయ్యలగూడెం: కన్నాపురం గ్రామంలోని పులి రామన్నగూడెం వెళ్లే రోడ్డులో బస్సు షెల్టర్ నిర్మించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని మెయిన్ సెంటర్లో ఉన్న బస్సు షెల్టర్ కొయ్యలగూడెం వైపు బుట్టాయిగూడెం వైపు రాకపోకలు సాగించేందుకు ఉందే కానీ, అత్యంత రద్దీగా ఉండే పులిరామన్నగూడెం వైపు బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆర్‌అండ్‌బీ స్థలాలు ఖాళీగా ఉన్నప్పటికీ బస్సు షెల్టర్ నిర్మాణం లేక బహిరంగంగా ఉంటూ ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లాపాపలతో ప్రయాణించే తాము వాహనాల కోసం రోడ్డుపైనే ఎదురుచూడాల్సిన దుస్థితి ఉంది అన్నారు. బస్సు షెల్టర్ నిర్మాణం వల్ల బుట్టాయిగూడెం, పోలవరం మండలాలకు చెందిన ఇరవైకి పైగా గిరిజన గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని, ప్రభుత్వం ఇందుకు కృషి చేయాలని కోరుతున్నారు.


కన్నాపురంలో నడిరోడ్డుపై పడిగాపులు పడుతున్న గిరిజనులు

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి అనారోగ్యం కలిగినా ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందడం మేలని ఉభయగోదావరి జిల్లాల మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై.శ్రీరామ్ అన్నారు. స్థానిక అమీనా పేటలో మాధురి హాస్పటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురి రోగులకు థైరాయిడ్, అరికాళ్ల మంటలు, తిమ్మిర్లు, మూర్ఛ వ్యాధి, ఛాతీలో మంట, నరాలు, గుండె సంబంధిత వైద్య పరీక్షలు, ఈసీజీ నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీ.నాగ దుర్గ శ్రీమన్నారాయణ, గొంతిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చింతాలమ్మకు కుంభాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీచింతాలమ్మ అమ్మవారి కుంభాభిషేక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డులోని పుట్టినిల్లుతో సహా పొలిమేరలో మెట్టినిల్లుగా ఉన్న ఆలయాల వద్ద మహిళా భక్తులు పసుపును పారాణిగా కలిపిన నీళ్ల బిందెలకు వేపమండలను కట్టుకొని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం గర్భగుడుల్లోని అమ్మవార్లకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. గ్రామ సుభిక్షం కోసం ఏటా రైతు సంఘం ఆధ్వర్యంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు.

నాగేశ్వరరావుకు చైర్మన్ పదవి కేటాయించాలి

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ పదవి ఏపీ టైలర్స్ వర్కర్స్ హెల్పర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కత్తి నాగేశ్వరరావుకి ఇవ్వాలని కొయ్యలగూడెం మండల టైలర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఏపీ టైలర్స్ వర్కర్స్ హెల్పర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడిగడప ఆంజనేయరాజు ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కత్తి నాగేశ్వరరావు 40 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఏ టైలర్‌కి కష్టం వచ్చినా వెంటనే స్పందించి ఆదుకునేవారని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు లేఖలు పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పశువులకు టీకాలు

టి.నరసాపురం: పశువుల్లో జబ్బవాపు వ్యాధి, బొబ్బచర్మ వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలో టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జబ్బవాపు వ్యాధి సోకకుండా 6వేల గేదెలకు, బొబ్బచర్మ వ్యాధి సోకకుండా 5 వేల ఆవులకు టీకాలు వేసినట్లు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు సోకకుండా ప్రభుత్వం అందిస్తున్న టీకాలు పశువులకు అందించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రం వద్ద పశువైద్య సహాయకులు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్‌ను అందుకుంటున్న కర్పూరం నాని

జంగారెడ్డిగూడెం: కర్ణాటక రాష్ట్రం హోసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన చిన్న తిరుపతి మాజీ బోర్డ్ డైరెక్టర్, ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారవేత్త కర్పూరం నాని డాక్టరేట్‌ను అందుకున్నారు. సేవా కార్యక్రమాలతో పాటు వ్యాపార రంగంలో ఎందరికో ఉపాధి కల్పించినందుకు ఆయనకు ఈ డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు పలువురు ఆయన్ను అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన ముళ్లపూడి


తాడువాయిలో మొక్కలు నాటుతున్న రాయుడు సుబ్బారావు

జంగారెడ్డిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు దివంగత ముళ్లమూడి హరిశ్చంద్ర ప్రసాద్ నిరంతరం పాటుపడేవారని తాడువాయి ఆంధ్రా షుగర్స్ కర్మాగారం ఇన్‌చార్జి రాయుడు సుబ్బారావు అన్నారు. ది.ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ అధినేత ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 104వ జయంతిని ఆదివారం తాడువాయి ఆంధ్రా షుగర్స్‌కర్మాగారంలో నిర్వహించారు. రాయుడు సుబ్బారావు చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. రాయుడు సుబ్బారావు మాట్లాడుతూ హరిశ్చంద్ర హరిత వన పథకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. హరిశ్చంద్రప్రసాద్ వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారని కొనియాడారు.

కృష్ణా డెల్టాకు సాగునీరు అందించాలి

ఏలూరు (టూటౌన్): కృష్ణాడెల్టాకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఒకవైపు అతివృష్టి, మరోవైపు అనావృష్టి పరిస్థితులు ఉండటం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కృష్ణా డెల్టా పరిధిలో ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాల్లోని భూములకు సాగునీరు అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని కోరారు.

సోందేగొల్లగూడేనికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ


విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న ఈఈ పి రాధాకృష్ణ

వేలేరుపాడు: పెద్దవాగు ప్రవాహం వల్ల నీటమునిగి లైన్లు పూర్తిగా దెబ్బతిన్న సోందేగొల్లగూడెం గ్రామానికి ఆదివారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. 1.5 కిలోమీటర్ల మేర లైన్‌కు మరమ్మతులు చేపట్టి, రెండు సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ పి సాల్మన్‌రాజు ఆదేశానుసారం ఈఈ పి, రాధాకృష్ణ పర్యవేక్షణలో గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గత ఎనిమిది రోజులుగా ఈ గ్రామానికి జనరేటర్‌పై విద్యుత్ సరఫరా కొనసాగించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ప్రారంభం


జంగారెడ్డిగూడెంలో బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బుట్టాయగూడెం రోడ్ జేజీఆర్ నగర్ కాలనీలో బస్‌షెల్టర్‌ను ఆదివారం ప్రారంభించారు. జెట్టి సత్యారావు జ్ఞాపకార్థం స్థానిక జేజీఆర్ కాలనీలో జెట్టి ఆదిత్య ఆధ్వర్యంలో ఈ బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ స్కూలు, కాలేజ్ పిల్లల కోసం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ముప్పిడి శ్రీనివాసరావు, వీరవల్లి సోమేశ్వరరావు, పిండి రాంబాబు, గోపిశెట్టి ప్రసాద్, తాడేపల్లి ఉమాదేవి, మామిడి రాము, దున్న శివ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

వేలేరుపాడు: పెద్దవాగు ప్రభావం వల్ల సర్వస్వం కోల్పోయిన అల్లూరినగర్, ఒంటిబండ గ్రామ గిరిజనులకు బుట్టాయిగూడెం మండలంలోని కొమ్ముగూడెం, కోటనాగారం గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో బియ్యం, కూరగాయలు, దుస్తులు, గ్లాస్లు, ప్లేట్‌లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ రెండు గ్రామాల్లో 150 కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లూరి కృష్ణమోహన్, కలగర రాము, హరిబాబు, చంగా పండు, అంగన్‌వాడీ కార్యకర్తలు నూర్జహాన్, వసుంధర, సుధ, మల, నాగమణి, దయామణి, కన్నమ్మ, కనకమున్నీ, సూపర్‌వైజర్‌లు ఝాన్సీ, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవత సమావేశం

జంగారెడ్డిగూడెం: మానవత శాఖ సమావేశం ఆదివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. అయినాల రమణ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆగస్టు నెల సంబంధించిన కార్యక్రమాలపై చర్చించారు. మానవతా విద్యానిది చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపరచాలన్నారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.